



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్.జగన్మోహన్‌రెడ్డి

కార్పొరేట్ బడి.. ఫీజుల దోపిడీ..!



నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోంది. జూన్ 12 నుంచి విద్యా సంస్థలు పున:ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థల కాసుల వేట ప్రారంభించాయి. ధనార్జనే ధ్యేయంగా తల్లిదండ్రుల ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఫీజులు, డొనేషన్లు తదితర కొత్తకొత్త పేర్లతో సొమ్ములు వసూలు చేస్తున్నాయి. నియంత్రణ లేని ఫీజుల వసూళ్లపై అధికారులు కనీసంగానైనా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ప్రయివేటు యాజమాన్యాల తీరు ఆడింది ఆట పాడింది పాటగా మారింది. ఇప్పటికే వేలు, లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుండగా ఈ ఏడాది మళ్లీ 10 నుంచి 30 శాతం ఫీజులను పెంచి వసూలు చేసేలా నిర్ణయం తీసుకున్నాయి.

- ప్రయివేటు, కార్పొరేట్ కాసుల వేట..!
- పుస్తకాలు, యూనిఫాం ధరల పెంపు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- కొరవడిన అధికారుల నియంత్రణ

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి


అనంతపురం జిల్లాలో 670 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 17,0,076 మంది ఏటా చదువుతున్నారు. పలు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండానే ఆయా యజమాన్యాలు పబ్బం గడుపుతున్నాయి. విద్యా ప్రమాణాలకు నీళ్లు వదులుతూ దారుణంగా ఫీజులు పెంచి వసూలు చేస్తున్నారు. అధిక ఫీజులపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. తమ పిల్లలు బాగా చదవాలన్న ఆశతో కార్పొరేట్ పాఠశాలకు వెళ్తున్న పేద, మధ్యతరగతి వర్గాలకు తల్లిదండ్రులకు చదువు భారంగా మారుతోంది.

యథేచ్ఛగా నిబంధనలు అతిక్రమణ

ప్రయివేటు కార్పొరేట్ విద్యా సంస్థలు యథేచ్ఛగా నిబంధనలను అతిక్రమిస్తున్నారు. సరైన వసతులు కల్పించకుండానే విద్యా సంస్థలను నడుపుతున్నారు. అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం సేఫ్టీ ప్రమాణాలను పక్కన పెడుతున్నాయి. పరిమితికి మించి విద్యార్థులను తరగతి గదుల్లో ఉంచుతున్నారు. అనేక పాఠశాలలకు ఆట స్థలం లేని దుస్థితి ఉంది. బస్సుల్లో విద్యార్థులను కుక్కి మరీ నడిపిస్తున్నారు. దూరంతో సంబంధం లేకుండానే రవాణా ఛార్జీలను భారీగా వసూలు చేస్తున్నారు. ఇలా అనేక నిబంధనలను తుంగలోకి తొక్కి వ్యవహరిస్తున్న పరిస్థితి ఉంది.

ఫీజుల మోత..

తమ పాఠశాలల్లో చేర్పించండి అంటూ పదేపదే ఇళ్లకు తిరిగిన యాజమాన్యాలు తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి వారి పాఠశాలల్లో పిల్లల్ని చేర్చుకుంటున్నారు. పాఠశాలల్లో చేర్చుకునేంత వరకు బాగానే ఉన్నా తర్వాత అసలు బాదుడు మొదలవుతోంది. ఫీజులకు సంబంధించి ప్రభుత్వం కొన్ని నిబంధనలను నిర్దేశించింది. జిల్లాలో ఇవి ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం చెప్పిన ధరలకు నాలుగు నుంచి ఐదు రెట్లు, కొన్ని కార్పొరేట్ పాఠశాలలు అయితే ఏకంగా పది రెట్లు పెంచి వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. ప్రతి సంవత్సరం రూ.10 వేల నుంచి రూ.20 వేలు పెంచి వసూలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కొన్ని యాజమాన్యాలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి .



నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు

ప్రయివేటు కార్పొరేట్ పాఠశాలలు పుస్తక విక్రయ వ్యాపార కేంద్రాలుగా మారాయి. యూనిఫాం, బూట్లు టై, పుస్తకాల పేరుతో దోపిడీ సాగుతోంది. పుస్తకాలకు రూ.5వేలు నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వీటిని విద్యాసంస్థల్లో విక్రయించకూడదు. బహిరంగా మార్కెట్లో దొరికే వాటి కన్నా పది రెట్లు అధిక ధరలు వసూలు చేస్తుండం గమనార్హం. తమ వద్ద తప్పా ఎక్కడా కొనేందుకు వీల్లేదనే నిబంధన పెట్టి ఎక్కువ ధరకు అమ్మకాలు చేస్తున్నారు.

కొరవడిన నియంత్రణ

నిబంధనలు పాటించకుండా నడుపుతున్న విద్యాలయాలపై సంబంధిత అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంది. ఆ మేరకు విద్యా శాఖ, ఇతర అధికారులు స్పందించిన దాఖలాలు నామమాత్రమే. తల్లిదండ్రులు ఎక్కడైనా ఫిర్యాదు చేసినా తూతూమాత్రంగా తనిఖీలు చేసి మిన్నకుండిపోతున్నారు. విద్యార్థి సంఘాలు ఆధారాలతో సహా విద్యాశాఖ అధికారులకు ప్రయివేటు, కార్పొరేట్ దోపిడీపై ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యంగా ఉంటున్నాయి.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

కార్పొరేట్, ప్రయివేటు విద్యాలయాల్లో ఫీజుల దోపిడీ కొనసాగుతోంది. అధికారులు దీనిపై ఏమాత్రం స్పందించడం లేదు. ఆధారాలతో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదు. నిబంధనలు పాటించకున్నా ఫీజులను మాత్రం లక్షల్లో వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాంను పాఠశాలల్లోనే విక్రయిస్తున్నారు. వీటిపై ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలి.

ఓతూరు పరమేష్,
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

గుర్తుండిపోయేలా..

మురళీనాయక్ జీవితం..!

- దేశం తనను ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది
- మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి
- మురళీనాయక్ కుటుంబానికి రూ.25 లక్షల సాయం

ప్రజాశక్తి-అనంతపురం, గోరంట్ల



మురళీనాయక్ తల్లిని ఓదారుస్తున్న జగన్

అతి చిన్న వయస్సులోనే దేశ రక్షణ కోసం తన ప్రాణాలను అర్పించిన వీర జవాను మురళీ నాయక్ జీవితాన్ని దేశ ప్రజలందరూ తమ గుండెల్లో చిరకాలం గుర్తుంచుకుంటారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జమ్ము కాశ్మీర్ వద్ద భారత్, పాకిస్తాన్‌ల మధ్య జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. బెంగుళూరులోని తన నివాసం నుంచి రోడ్డు మార్గం ద్వారా శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చేరుకున్నారు. నేరుగా మురళీనాయక్ ఇంటికి వెళ్లి అతని తల్లిదండ్రులు శ్రీరామ్‌నాయక్, జ్యోతిబాయిలను పరామర్శించారు. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ సరిహద్దులో జరిగిన కాల్పులు, మురళీ నాయక్ మరణించిన తీరు తదితర వివరాలను తల్లిదండ్రులతో అడిగి తెలుసుకున్నారు. దేశ కోసం ప్రాణాలు అర్పించే కుమారున్ని కన్న తల్లిదండ్రులు గొప్పవారంటూ శ్రీరామ్‌నాయక్, జ్యోతిబాయిలను ఓదర్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ సరిహద్దులో శత్రువులను నిలువరించేందుకు వీర జవాను మురళీ చూపిన తెగవ మరువలేనిదని చెప్పారు. చిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆయన తెగువ దేశం ఎప్పటికీ గుర్తించుకుంటుందని తెలియజేశారు. ఆయన ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. జవాను కుటుంబానికి వైసిపి అన్ని విధాలా అండగా ఉంటుందని తెలియజేశారు.

రూ.25 లక్షల ఆర్థిక సాయం

వీర జవాను మురళీ కుటుంబానికి వైసిపి తరుపున రూ.25 లక్షలు అందిస్తున్న జగన్మోహన్‌రెడ్డి తెలియజేశారు. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు ఇచ్చేలా గత వైసిపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దానికి కొనసాగింపుగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం మురళీ నాయక్ కుటుంబానికి రూ.50 లక్షలు, ఇతర సదుపాయాలు అందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు కెవి.ఉషశ్రీ చరణ్, మాజీ ఎమ్మెల్యేలు శంకరనారాయణ, అత్తార్ చాంద్‌బాషా, వై.విశ్వేశ్వర రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, కదిరి వైసిపి సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ పాల్గొన్నారు.



కదిరి ఛైర్మన్ పీఠం ఎవరిదో..!

- 19న ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక
- మైనార్టీ మహిళకు ఛాన్స్
- పోటీ పడుతున్న ఇద్దరు మహిళా నేతలు
- ఎమ్మెల్యే కందికుంట చేతుల్లో నిర్ణయం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి మున్సిపాల్టీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక ఉత్కంఠను రేపుతోంది. పురపాలక సంఘం పగ్గాలు ఎవరికి దక్కుతాయో అన్న ప్రశ్న అందరి మదిలోనూ మెదులుతోంది. ఇటీవల వైసిపి ఛైర్‌పర్సన్ నజీమున్నీసాపై సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాసం పెట్టి పదవి నుంచి దించేశారు. ఖాళీ అయిన ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్ల పదవులను భర్తీ చేసేందుకు అధికారులు ఈ నెల 19న ఎన్నిక నిర్వహించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికలప్రధాన అధికారి నీలం సాహ్నీ ఈ నెల 13వ తేదీ నోటిఫికేషన్ విడుదల చేసి జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఈ మేరకు కదిరి పురపాలక సంఘం నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధం అయ్యారు.



కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్ల పదవులు పొందేందుకు పోటీ ఎక్కువగానే కన్పిస్తోంది. ఈ పదవులు సొంతం చేసుకునేందుకు చాలా మంది కౌన్సిలర్లు పోటీ పడుతున్నారు. కదిరి పట్టణంలో 36 వార్డులు ఉండగా గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీకి 30, టిడిపికి ఐదు, ఒకరు ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆరుగురు వైసిపి, ఇక స్వతంత్ర కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. దీంతో టిడిపికి 12 మంది కౌన్సిలర్లు అయ్యారు. మిగిలిన 24 మంది కౌన్సిలర్లలో 13మంది ఛైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. ప్రస్తుతం వీరంతా కలిసి నూతన పాలక మండలిని ఎన్నుకోనున్నారు.

లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరే అవకాశం

వైసీపీకి చెందిన అసమ్మతి కౌన్సిలర్లు అందరూ ఈనెల 15న మంత్రి నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇదే జరిగితే ఎమ్మెల్యే కందికుంట సారథ్యంలో టిడిపి మద్దతుతో నూతన పాలకవర్గం ఏర్పాటు కాబోతోంది. కదిరిలో అభివృద్ధి దృష్ట్యా ఎమ్మెల్యే కందికుంట వెంట నడవడమే మేలనే భావన మెజార్టీ కౌన్సిలర్లలో కన్పిస్తోంది.

మైనార్టీ మహిళలకు అవకాశం

గత 16 సంవత్సరాలుగా కదిరి మున్సిపల్ ఛైర్మన్ పీఠంపై మైనార్టీ మహిళకే అవకాశం కల్పిస్తున్నారు. దీనికి కొనసాగింపుగా ఈ సారీ కూడా మైనార్టీ మహిళకే అవకాశం ఇచ్చేలా పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ఛైర్‌పర్సన్ స్థానానికి సంబంధించి 30, 10వ వార్డు సభ్యుల పేర్లు ప్రముఖంగా విన్పిస్తున్నాయి. ఇక వైస్ ఛైర్మన్లకి సంబంధించి ఒకటి బీసీ, మరొకటి మరో సామాజిక వర్గానికి కేటాయించేలా నిర్ణయం జరుగుతున్నట్లు సమాచారం. రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికకు సంబంధించిన ఉత్కంఠకు ఈ నెల 19న తెరపడనుంది.

గోనిపేట ప్రధానరోడ్డు పక్కన ఉన్న ఇటుకల బట్టీ



సిమెంటు, ప్లయాష్ ఇటుకలు అందుబాటులోకి వచ్చినా మట్టి ఇటుకలనే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. దీంతో ఇటుకల వ్యాపారానికి డిమాండ్ పెరిగింది. దీంతో పచ్చని పొలాలు ఇటుక బట్టీలుగా మారిపోతున్నాయి. చెరువుల్లో మట్టి తరలిపోతోంది. పక్క పచ్చని చెట్లు నెలకొరుతున్నాయి. అక్రమ మట్టి తవ్వకాలు జోరు పెరిగింది. చెరువుల్లో ఉన్న నల్ల మట్టిని కోసం భారీగా తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వభూమి, చెరువులు అనే తేడా లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా బట్టీలకు అగ్గి పెడుతున్నారు. కాలుష్యానికి కారకులవుతున్నారు.

సరిహద్దుల్లో పొగ.. ఊరంతా పొగ..!

- నిబంధనలకు విరుద్ధంగా ఇటుకల బట్టీలు
- కాలుష్యం బారిన ప్రజలు
- చెరువులు,ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఇటుక బట్టీ వ్యాపారం జోరుగా సాగుతోంది. పెనుకొండ, గోరంట్ల, సోమందేపల్లి, పరిగి, రొద్దం మండలాల్లో ఇటుక బట్టీలు అధిక సంఖ్యలో ఏర్పాటయ్యాయి. పెనుకొండ మండలంలో 100, సోమందేపల్లి మండలంలో 30 నుంచి 50, రొద్దం మండలంలో 25 నుంచి 40, పరిగి మండలంలో 35, గోరంట్ల మండలంలో 85 ఇటుకల బట్టీలు ఉన్నాయి. వీటిలో 80శాతం మంది పెద్ద షెడ్లు నిర్మాణం చేసి ఇటుకలు తయారు చేస్తారు. సాధారణ ఇటుక పరిమాణం 4.11 అంగుళాలు, సిమెంటు, ఫ్లైయాష్ సిమెంటు ఇటుకలు9. 11 అంగుళాల పరిమాణంలో ఉంటాయి. ఒక్క ఇటుక రూ.38 నుంచి రూ.40 వరకు పలుకుతోంది. మట్టి ఇటుకలు ఒక ట్రాక్టర్‌లో 2వేల వరకు వస్తాయి. ఒక్క ట్రాక్టర్ ఇటుకల ధర రూ. 12500 నుంచి రూ.13 వేల వరకు ఉంది.మట్టి ఇటుకలు వినియోగించడం వల్ల చల్లదనం ఉంటుందనే విశ్వాసం వినియోగదారుల్లో ఉంది.

నిబంధనలకు విరుద్ధంగా ఇటుకల బట్టీలు

నిబంధనలకు విదుద్ధంగా ఇటుకబట్టీలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇటుక బట్టీల ఏర్పాటుకు రెవెన్యూ, పంచాయతీ, కార్మికశాఖ, పరిశ్రమ శాఖ, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు ఉండాలి. ఇటుకల తయారీకి వ్యవసాయ భూములు లీజుకు తీసుకుని బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయేతర అవసరాలకు వినియోగించేందుకు అనుమతులు తీసుకుని ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సిఉంది. కొందరు ఎకరం నుంచి మూడు ఎకరాల వరకూ లీజుకు తీసుకుని పెద్ద ఎత్తున ఇటుకల బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండానే బట్టీలు నిర్వహిస్తున్నారని విమర్శలున్నాయి.

కాలుష్యం బారిన ప్రజలు

పుట్టగొడుగుల్లా పుటుకొస్తున్న ఇటుకల బట్టీలతో కాలుష్యం బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటుకల బట్టీల నుంచి వచ్చే పొగతో రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. పట్టణం, గ్రామాల సమీపంలో ప్రధాన మార్గాలకు అనుకుని రవాణకు అనుకూలంగా ఉన్న పంట పొలాల్లో ఇటుక బట్టీల వ్యాపారం యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఆయా బట్టీలు ఇళ్ల మధ్యలో, జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్నారు. ఇటుకలను కాల్చేందుకు వినియోగించే కట్టెలు, పొట్టుతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, పొగ, దుమ్ము కళ్లలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్ల పై వెళ్లే ప్రయాణికులు వాపోతున్నారు.

చెరువులు,ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు

మట్టిమాఫీయా చెరువుల్లో మట్టిని పెద్ద ఎత్తున తరలించి సొమ్ముచేసుకుంటోంది.కొందరు ఖాళీ స్థలాల్లో మట్టిని నిల్వ ఉంచుకుని అమ్ముకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాలు చేసి ప్రభుత్వఆదాయనికి గండి కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, నీటిపారుదల, మున్సిఫల్ శాఖ అధికారులు పట్టించుకున్న పాపన పోలేదు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు..

ఇటుక బట్టీలు కాల్చడానికి పెనుకొండ నియోజకవర్గం వ్యాప్తంగా కట్టెలనే ఉపయోగిస్తారు. అక్కడక్కడ కట్టెలతో పాటు ఊక పొట్టుని వినియోగిస్తున్నారు. ఆరు పొయ్యిలు ఉన్న ఇటుక బట్టీని కాల్చాలంటే దాదాపు 5 ట్రాక్టర్ల కట్టెలు అవసరమవుతాయి. దీంతో కట్టెల వ్యాపారం చేసుకునే వారు పెద్ద చెట్లను నరికి ఇటుకల బట్టీలకు అమ్ముకుంటున్నారు. తుమ్మ, వేప చెట్లను ఇష్టారాజ్యంగా నరికి తరలిస్తున్నా అటవీశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఏడాదికి ఒక సారి బట్టీల నిర్మాహకులతో మాముళ్లు తీసుకుని కళ్లుమూసుకుంటున్నారు.

అధికారులు స్పందించాలి: స్థానికులు

నివాసగృహాల సమీపంలో ఇష్టారాజ్యంగా ఇటుకల బట్టీలు ఏర్పాటు చేసి కాలుష్యం చేస్తున్న నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. పట్టణాలు, గ్రామాలకు దూరంగా బట్టీలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: అధికారులు

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇటుకల బట్టీలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని రెవిన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖ, అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు. పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేసిన మట్టి మాఫియా



నిల్వ చేసిన మట్టి కుప్పలు

జిల్లాలో 415.2 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్:-

జిల్లాలోని 18 మండలాల్లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి 415. 2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు రెవిన్యూ గణాంక అధికారులు తెలిపారు. అత్యధికంగా కొత్తచెరువులో 77.6 మిల్లీమీటర్లు నమోదు కాగా అత్యల్పంగా బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఒడిసి లో 74.6, బుక్కపట్నం 59.4, పుట్టపర్తి 59.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా మిగతా మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది. సోమవారం పగలు విపరీతంగా ఎండలతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. రాత్రి కురిసిన వర్షానికి మంగళవారం కాస్త ఉపశమనం కలిగింది. ఇలాగే ఈ వారంలో వర్షాలు కురిస్తే రైతులు ఖరీఫ్ సీజన్‌కు భూములు దుక్కి దున్ని చదును చేసుకునే అవకాశం ఉంటుంది.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

ఈనెల 20న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు వివి రమణ, రామిరెడ్డి మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ 20 తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కుల్లాయప్ప, ఆశీర్వదమ్మ, బషీర, రైతు సంఘం శ్రీనివాసులు, అంజినప్ప, బావన్న, స్టాక్ పాయింట్ అమాలి, నారాయణస్వామి, నాగరాజు. తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలో వున్న సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం పట్టణంలోని ఇందిరానగర్, గీతానగర్, పిట్టల్ వీధి సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనుంచి ఆకస్మిక తనిఖీలు నిరంతరం ఉంటాయనిఅప్రమత్తంగా ఉండి సమయపాలన పాటించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ట్రాన్స్‌కో ఏఇ శివయ్య పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామనిఈ విషయాన్ని బత్తలపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

నిరక్షరాస్యులను గుర్తించండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

నిరక్షరాస్యులను గుర్తించాలని అధికారులు సూచించారు. ఉల్లాస్ రెండో విడత అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు వెలుగు మండల సమాఖ్య కార్యాలయం నందు వయోజన విద్య పర్యవేక్షకుడు సుధాకర్, మధు సూదన్ పుట్టపర్తి ఏరియా మండలాలకు సంబంధించిన వెలుగు సిసిలు,ఏపిఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా వయోజన విద్య పర్యవేక్షకులు సుధాకర్, మధుసూదన్ మాట్లాడుతూ కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలకు సంబంధించిన గ్రామాలలో 18 సంవత్సరాలు నిండిన నిరక్షరాస్యుల గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య ఏరియా కోఆర్డినేటర్ పద్మావతి,కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలం నుంచి బదిలీపై వెళ్లిన అధికారులను స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. ఎంపీపీ రాము,ఎంపిడిఓ పార్థసారథి వారిని సన్మానించారు. ఏపీవో మంజుల, డి ఎల్ పి వో అంజన్న ఇటీవల బదిలీ అయ్యారు. ఈసందర్భంగా వారిని మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ మాధవరెడ్డి, గ్రామ కార్యదర్శులు,ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గరుడాంజనేయస్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మొలకల పౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ముగలవారిపల్లి వద్ద ఉన్న శ్రీ గరుడ ఆంజనేయ స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిశోరి వికాసంపై అవగాహన

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని వీరాపురం అంగన్‌వాడీ కేంద్రంలో సిడిపిఒ శాంతి ఆదేశాలతో, సూపర్‌వైజర్ లలితమ్మ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. 14-18 ఏళ్ల కిశోర బాలికలకు విద్య, వైద్యం అభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం, పరిశుభ్రత తదితర 12 అంశాలపై అవగాహన కల్పించారు. సమ్మర్ క్యాంప్ నిర్వహించి, బాలికలలో పోటీతత్వం పెంపొందించారు. ఈ కార్యక్రమంలో ఫాంధిని, ఏఎన్ఎం మంజుల, ఎస్టీవో మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రొద్దం : కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం మంగళవారం మండలంలోని నారనాగేపల్లి, గౌరోజుపల్లి,ఎం. కొత్తపల్లి అంగన్ వాడి కేంద్రాలలో ఐ సి డి ఎస్ సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఐ సి డి ఎస్ సిడిపిఒ జి శాంతకుమారి ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ కిశోరబాలికలకు పలు సూచనలు చేశారు. బాలల హక్కులు, పోక్సో చట్టం గురించి, బాల్య వివాహ నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించారు. అలాగే ఐ సి డి ఎస్ సూపర్‌వైజర్ ఎం.సుజాతమ్మ ఆధ్వర్యంలో చోళేమర్రి గ్రామ అంగన్‌వాడీ కేంద్రం లో కిశోరి వికాసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు అంజినమ్మ, త్రివేణి, కిశోరి బాలికలు తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీలో టిడిపి కార్యకర్తలు ఎవరు అధైర్యపడవద్దని ఆ కుటుంబాలను ఆదుకుని అండగా ఉంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని బ్రాహ్మణపల్లి లో టిడిపి కార్యకర్త పోతలయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే పట్టణంలోని కుమ్మర వీధికి చెందిన కార్యకర్త హేమలత మృతిచెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మరొక కార్యకర్త రఫీక్ కుమారుడు నియాజ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా అక్కడికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి పట్టణ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సొంతూరులో పరిశ్రమలు స్థాపించండి

రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

'ఎక్కడెక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు సొంతూరులో పరిశ్రమలు పెట్టి ఆప్రాంతాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, యువతకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. మంగళవారం పెనుకొండ షీఫాం సమీపంలో 59.37 ఎకరాల్లో ఏర్పాటు చేయబోతున్న ఎంఎస్ఎంఇ పార్కుకు మంత్రి సవిత భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఏపీని పారిశ్రామిక హబ్ గా సీఎం చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా యువతను వ్యాపారవేత్తలుగానూ తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి దశలో 50 పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పెనుకొండ లో 59.37 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

తొలి దశలో 20 ఎకరాల్లో...

ఎంఎస్ఎంఇ పార్కులో తొలి దశలో 20 ఎకరాల్లో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. 115 సూక్ష్మ తరహా పరిశ్రమలకు భూ కేటాయింపులు చేస్తున్నట్లు వెల్లడించారు. రూ.7 కోట్లతో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, యువకులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి కోరారు.

సొంతూర్లో పరిశ్రమలు పెట్టండి...

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, యువత ఎక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు, సొంతూర్లోనే కంపెనీలు ఏర్పాటుకు ఎంఎస్ఎంఇ పార్కులు ఎంతగానో దోహదపడతాయన్నారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల అక్కడి యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఇతర ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు వల్ల వచ్చే ఆదాయం అక్కడి ప్రభుత్వాలకు, ప్రజలకు ఉపయోగపడతుందన్నారు. స్థానికంగా పరిశ్రమల ఏర్పాటు చేయడం వల్ల ఇక్కడి ఆదాయం...స్థానిక ప్రజలకు, ప్రభుత్వానికి లభ్యమవుతుందన్నారు.

ఉద్యోగాల కల్పనే ధ్యేయం : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సవిత అన్నారు. పెనుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళాను మంత్రి సవిత మంగళవారం ప్రారభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ ,ఐటీఐ, డిప్లొమా ,డిగ్రీ , బీటెక్ ఎంబీఏ, ఎంసిఏ చదివిన నిరుద్యోగ యువత రాష్ట్రంలో లక్షలాది మంది ఉన్నారని వారికి ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగావకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామనితెలిపారు. సుమారు 50 కి పైగా వివిధ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని నైపుణ్యాలను బట్టి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్, తహశీల్దార్ శ్రీధర్, ప్రిన్సిపల్ కేశవరావు అధికారులు నాయకులు కార్యకర్తలు నిరుద్యోగులు పాల్గొన్నారు .



సమావేశంలో మాట్లాతున్న మంత్రి సవిత

వ్యవసాయ భూములకు నీరందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా కాలువ వెడల్పు చేసి వ్యవసాయ భూములకు నీరు అందించాలని సిపిఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కదిరి సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, జిఎల్. నరసింహులు మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం కరువు సీమకు వరప్రసాదనిగా ప్రకటించిన హంద్రీనీవా ద్వారా ఉమ్మడి జిల్లాలో మూడున్నర లక్షల ఎకరాలకు నీరు అందించి ఆయకట్టుగా మారుస్తామని చెప్పారని వారు గుర్తు చేశారు. దశాబ్దాలు అవుతున్నా హంద్రీనీవా వ్యవసాయానికి వరంగా మారలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్న హంద్రీనీవా లక్ష్యం మాత్రం నేటికీ నెరవేరలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు చేపట్టిందన్నారు. ఈ పనుల వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతాయన్నారు. కాలువను వెడల్పు చేసి పిల్లకాలువల ఏర్పాటు చేసి తద్వారా వ్యవసాయ భూములకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు వివి రమణ, శివన్న, సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్, ముస్తాక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రొద్దం

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దన్న డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆయనతో పాటు జిల్లా కమిటీ సభ్యులు కోగిర నారాయణ మంగళవారం మండలంలోని కంచిసముద్రం, లోచర్ల, కొత్తూరు గ్రామాల్లోనిఉపాధి కూలీలు పని ప్రదేశాల్లో కలిశారు. ఈ సందర్భంగా కూలీలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వారానికి 700 నుండి 900 రూపాయలు మాత్రమే వస్తోందని, 6 రోజులు పని చేస్తే 4,5 రోజులకు హాజరు వేస్తున్నారని కూలీలు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. రోజుకు 300 రూపాయలు అనేది బూటకం అని విమర్శించారు. పే స్లిప్పులు ఇవ్వటం లేదని 3 వారాలు అవుతున్న బిల్లులు రాలేదని వాపోయారు. శ్రమ శక్తి సంఘాలు లేవని మేట్లు ఎవరో తెలీదని అన్నారు. రోజుకు 1.50 క్యూబిక్ మీటరు పని చేస్తున్నామని రోజు రాను పోను ఆటో చార్జీలు భారం పడుతోందని చెప్పారు. పని ముట్లు ఇవ్వలేదన్నారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ కూలీలు సంఘం ద్వారా ఐక్యంగా పోరాడి సమస్యలు పరిష్కారం చేసుకోవాలని సూచించారు. బుధవారం లోచర్ల గ్రామ సచివాలయం వద్ద జరిగే ధర్నాలో కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పెద్దన్న

పరిశ్రమలతోనే ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఇంటికొక పారిశ్రామికవేత్త ను తయారుచేసి పరిశ్రమలతో ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం కప్పల బండ సమీపంలో ఎపిఐఐసి ఆధ్వర్యంలో సూక్ష్మ ,చిన్న మధ్యతర పరిశ్రమల వాడను జిల్లా కలెక్టర్ టీ ఎస్ చేతన్ , మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి సమీపంలోని కప్పలబండ పారిశ్రామికవాడలో 104 ఎకరాలలో రూ 154 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు అయితే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పరిశ్రమలు రావడం వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు ఆదాయ రంగం పెరిగి ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పుట్టపర్తి పారిశ్రామికవాడ ఆంధ్ర ప్రదేశ్ రోల్ మోడల్ కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఇక్కడ ఉన్న పారిశ్రామిక వేత్తలు చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ 2014 నుంచి 2018 వరకు అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో కప్పల బండ వద్ద 104 ఎకరాలు సేకరించి పారిశ్రామిక వార్డును ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఉత్పత్తిని రంగాన్ని ఏర్పాటు చేసుకొని ఆదాయ మార్గం వైపు పయనించాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ పరిశ్రమలు వస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెంది ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు కూడా ఈ పారిశ్రామిక వేత్తలు కావాలని పిలుపునిచ్చారు. పుట్టపర్తి సమీపంలో కప్పల బండ ప్రాంతంలో పారిశ్రామిక వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, ఏపీఐఐసీసీ జోనల్ మేనేజర్ సోనీ ఏపీఐఐసీ, డీఐసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర



సిబిఎస్ఇ ఫలితాల్లో 'జైన్' విద్యార్థుల ప్రతిభ


ప్రజాశక్తి - కదిరి టౌన్

సీబీఎస్ఈ పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని జైన్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 500 మార్కులకు గాను భవిత 462, షగుఫ్తా సుల్తానా454, సారా కౌసర్ 446, హర్షద్ 438, లాస్యప్రియ 435 మార్కులతో ప్రతిభ కనపర్చారు. వందశాతం ఫలితాలను మొదటి సంవత్సరం లోనే అందించిన విద్యార్థులను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఉమామహేశ్వర్, పాఠశాల సిఒఒ సాగర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'లోటస్' విజయకేతనం

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన సీబీఎస్ఈ టెన్త్ పరీక్షా ఫలితాలలో పట్టణంలోని లోటస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ చరిత్ర సృష్టించిందని పాఠశాల అధ్యక్షులు నీలకంఠ రెడ్డి తెలిపారు. సిబిఎస్ఇ బోర్డు పరీక్షల్లో ఇప్పటి వరకు వరుసగా తమ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఫలితాలను సాధించారన్నారు. యోగేశ్వర్ సాయి రెడ్డి 469, గీతా క్రిష్ణ, కోమలి, సందీప్ రెడ్డి 467, జోషిణి 455 మార్కులను సాధించారన్నారు. వీరితో పాటు మిగిలిన విద్యార్థులందరు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల అధ్యక్షులు నీలకంఠ రెడ్డి, డైరెక్టర్ ప్రజీత్ రెడ్డి, ప్రిన్సిపల్ సతీష్ కుమార్ ఉపాధ్యాయులు అభినందించారు.



సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక సమస్యలపై సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం హిందూపురం సిఐటియు కార్యాలయంలో సమ్మె బుక్ లెట్స్‌ను సిఐటియు, అనుబంధ సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు హిందూపురం పట్టణ కన్వీనర్ విఆర్ రాము, ఆశా వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి మమతమ్మ, యూనియన్ సభ్యులు అలివేలమ్మ, సునీతమ్మ, దిల్షాద్, సుకన్య, నాగదేవి, హసీనా, గాయత్రి, మెడికల్ రెప్స్ యూనియన్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, రామ్మూర్తి, పట్టణ ఆటో యూనియన్ నాయకులు మోదా సురేష్, రాజు, రాజశేఖర్, ఆర్.ఎల్. ఎఫ్ యూనియన్ కార్యదర్శి లక్ష్మీకాంతం, అధ్యక్షులు జయచంద్ర, టాటా ఏసీ వర్కర్స్ యూనియన్ నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న నాయకులు

సిబిఎస్ఇ ఇంటర్ ఫలితాల్లో సువర్ణ భారతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి హిందూపురం

కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన సి బి ఎస్ సి సీనియర్ సెకండరీ-2025 ఫలితాల్లో స్థానిక సువర్ణ భారతి పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల అధ్యక్షులు నీలకంఠ రెడ్డి, ప్రిన్సిపల్ రవీంద్ర రెడ్డి తెలిపారు. ఎంపిసీలో అభివర్మ 444, బైపిసిలో రూపా 417 మార్కులను సాధించారన్నారు. వీరితో మిగిలిన విద్యార్థులు సైతం ప్రథమ శ్రేణి మార్కులను సాధించారన్నారు. ఇంటర్ ఫలితాల్లో కళాశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం తరహాలోనే ఈ సంవత్సరం సైతం సత్తా చాటి కళాశాల ప్రతిష్టలను నలు దిశల చాటారన్నారు. అత్యుత్తమ మార్కును సాధించిన విద్యార్థులకు వీరితో పాటు కళాశాల డైరెక్టర్ ప్రజిత్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



వినాయక చవితి వేడుకలకు ముందస్తు ప్రణాళికలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రానున్న వినాయక చవితి వేడుకలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో కదిరి ప్రాంతానికి చెందిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసి తో పాటు డిఆర్ఒ విజయసారథి, కదిరి ఆర్డీవో వివి. శర్మ, విద్యుత్ శాఖ ఎస్ ఈ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఆగస్టులో రానున్న ఈ ఉత్సవాలకు అధికారులు ఇప్పటి నుంచే తగిన ప్రణాళికలతో సన్నద్ధం కావాలన్నారు. రసాయనక విగ్రహాలు వాడకుండా మట్టి విగ్రహాలు వినియోగించాలన్నారు. ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి తహశీల్దారు మురళీకష్ణ, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేంద్ర నాయక్, సంబంధిత అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని మలక వేముల క్రాస్‌లో మిద్దెపై నుంచి పడి బిటెక్ విద్యార్థి మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన పట్నం ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు మలకవేముల క్రాస్‌కు చెందిన టిడిపి నాయకుడు మల్లికార్జున కుమారుడు బీటెక్ విద్యార్థి రూపేంద్ర మూడు అంతస్తుల మిద్దిపై సోమవారం రాత్రి నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి వర్షం మొదలవడంతో నిద్ర మత్తులోకిందకి దిగే సందర్భంలో ప్రమాదవశాత్తు మిద్ది పైనుండి కిందికి పడ్డాడు. ఈ ప్రమాదంలో రూపేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని ప్రశాంతి గ్రామం లో నివాసం ఉంటున్న నసనకోట ఉదయ చంద్రిక అనే బాలిక అదృశ్యం కావడంపై పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న తెలిపారు. ఈమె వయసు 17 సంవత్సరాలనీ ఇటీవలే పదవ తరగతి పాస్ అయిందని చెప్పారు. ఇంటి వద్ద తల్లిదండ్రులతో పాటు ఉంటూ 11వ తేదీన రాత్రి ప్రశాంతి గ్రామంలోని ఇంటి వద్ద నుండి ఎవ్వరికి తెలపకుండా వెళ్లిపోయిందని ఆమె తల్లిదండ్రులు అరుణ, శేషాద్రి తెలిపారు. ఈ మేరకు వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

మండల కేంద్రంలోని పెడబల్లి రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. కదిరి మండలం తెల్లగుట్టపల్లి గ్రామానికి చెందిన గంగాధర్ అనే వ్యక్తి మంగళవారం సాయంత్రం బత్తినగారిపల్లి నుంచి ద్విచక్ర వాహనంలో ఎన్ పి కుంటకు వస్తుండగా మండల కేంద్రానికి సమీపంలోని మోరీలమిట్ట దగ్గర వాహనం అదుపు తప్పి కిందికి పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన గంగాధర్‌ను మెరుగైన వైద్యం కోసం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

హిందూపురం మండలం కొట్నూరు గ్రామంలో పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన అధికారులు బేకతారు చేయడం అన్యాయమని వెంటనే కోర్టు ఉత్తర్వులను అధికారులు అమలు చేయాలని ఇంటి స్థలాల పోరాట సంఘం కార్యదర్శి, సిఐటియు జిల్లా అధ్యక్షుడు జెడ్పి శ్రీనివాసులు విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు, 450 మంది పేదలు ఇల్లు లేక అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ఏడాది నుంచి అధికారులందరికీ మొరపెట్టుకున్న పట్టాలు ఇవ్వలేదన్నారు. దీంతో పేదలు గుడిసెలు వేసుకున్నారన్నారు. అధికారులు చుట్టూ తిరిగి అలసిపోయి హైకోర్టును పేదలు ఆశ్రయించగా మూడు నెలల లోపు ఇంటి పట్టాలు ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అయితే ఆ ఉత్తర్వులను అమలు పరచడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇంతవరకు సర్వే కూడా నిర్వహించలేదన్నారు. హైకోర్టు ఉత్తర్వుల బోర్డులు కూడా తహశీల్దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ నౌకర్లతో తొలగించారని విమర్శించారు. హైకోర్టును కూడా అవమానపరిచే విధంగా అధికారులు ప్రవర్తిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైకోర్టు ఉత్తర్వులను గౌరవించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

టిడిపి మండల కన్వీనర్ నియామకంపై కసరత్తు

ప్రజాశక్తి - చిలమత్తూరు

తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ నియామకంపై ఆపార్టీ నాయకులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు మండల పరిధిలోని విశ్వశ్రీ విద్యానికేతన్ పాఠశాలలో ఆ పార్టీ అంతర్గత సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బాలక్రిష్ణ వ్యక్తిగత సహాయకులు సురేంద్ర బాబుతో పాటు అబ్జర్వర్ పాల్గొన్నారు. నాయకులు కార్యకర్తలలో ఆశావాహులు వారి వారి పేర్లు ఇవ్వాలని కోరగా అనేక మంది తమ పేర్లు ప్రతిపాదన తీసుకొచ్చారు. కాగా వారిలో ఇప్పటికే నామినేటెడ్ పోస్ట్ లలో ఉన్నవారు అనర్హులని అబ్జర్వర్ సూచించగా ఇక మిగిలిన వారు బలంగానే వారి వారి ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగా వారికి బలంగా ఉన్న కార్యకర్తలతో బలనిరూపణ కార్యక్రమం చేపట్టారు. కాగా ఈ సారి బీసి సామాజిక వర్గానికి కన్వీనర్ ఇవ్వాలని కొంత మంది పట్టు పట్టినట్లు తెలుస్తుంది. అయితే తన ప్రభుత్వ ఉపాధ్యాయ వత్తిని సైతం వదులు కొని పార్టీకోసం అహర్నిషలు కష్టపడుతున్న రంగారెడ్డినే కన్వీనర్ గా కొనసాగించాలని కొంత మంది పట్టు పట్టినట్లు తెలుస్తోంది. రంగారెడ్డి, లక్ష్మినారాయణ యాదవ్, ఎగువింటి శ్రీనివాసులులో ఎవరినో ఒకరిని కన్వీనర్ గా నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

బాల్య వివాహాలను అరికడదాం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అధికారులు అందరీ పైన ఉందని పుట్టపర్తి ఆర్డీవో అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం లో సైబర్ నేరాలు బాల్య వివాహాలు అరికట్టే విషయంపై, ఆటో కాంపెయిన్ బ్యానర్లు , వాయిస్ ద్వారా చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ , జిల్లా బాలల పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో వాల్మీకి సేవా సంఘం సెక్రెటరీ విరనారప్ప సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఆటో క్యాంపెయిన్‌ను పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ సీడీపీఓ గాయత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సువర్ణ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఎంత గోప్యతగా ఉంటే అంత శక్తివంతులుగా ఉంటారన్నారు. సైబర్ మయమైన ప్రపంచంలో మన వివరాలు అన్ని గోప్యంగా ఉంచుకోవలసిన అవసరం ఉందన్నారు. అంతే కాకుండా జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చూసుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లల నడవడిక చూసుకుంటూ మొబైల్ వాడకం పట్ల జాగ్రత్తగా ఉండే విధంగా పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలో ఈ ఆటో కాంపెయిన్ అన్ని ప్రాంతాల్లో తిరిగి ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని,అవగాహన చేసుకున్న వారందరూ సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉంటూ పిల్లలను బాల్య వివాహాలకు గురి కాకుండా చూడాలని సూచించారు. అనంతరం పుట్టపర్తి మునిసిపాలిటి పుర వీధులలో ఆటో కాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిపిఒ మహేష్, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, సోసియల్ వర్కర్ ఆనంద్, జగదీష్, యూత్ అంబాసిడర్లు మనిదీప్,సురేంద్ర, సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

ముస్లిములకు అండగా ఉంటాం పరిటాల శ్రీరామ్

ధర్మవరం రూరల్ : ధర్మవరం నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడ ముస్లింల అస్తిత్వానికి ప్రమాదం వచ్చినా.. అక్కడ తాను ఉంటానని టిడిపి నాయకులు పరిటాల శ్రీరామ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ధర్మవరం సమీపంలోని ఒక దాబాలో సోమవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి మంగళవారం తన వ్యక్తి గత కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన స్పందించారు.కొందరు వ్యక్తులు దాదాఖలందర్ పై దురుసుగా వ్యవహరించడం జరిగిందని ఈ సంఘటన మీద రాత్రి వేళ ముస్లింలు పెద్ద ఎత్తున ఆందోళనకు రావడం జరిగిందని అన్నారు. విషయం తెలుసుకున్న తాను స్థానిక సిఐ, డీఎస్పీకి ఫోన్ చేసి మాట్లాడానన్నారు. ఈ ఘటనలో ఎవరున్నా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. అయితే ఈ విషయాన్ని కొందరు తప్పుదోవ పట్టిస్తున్న నేపథ్యంలో తాను స్పందించాల్సి వచ్చిందన్నారు. ఈ విషయంలో పోలీసులను పూర్తి స్వేచ్ఛగా చర్యలు తీసుకోవాలని తాను కోరినట్లు వివరించారు. దీంతో పోలీసులు కూడా వెంటనే కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అయితే తాను ఇంత వేగంగా స్పందిస్తానని కొందరు వ్యక్తులు ఊహించి ఉండరని ఈ గొడవను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు వారు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని వ్యాఖ్యానించారు. ధర్మవరంలో ముస్లింలకు ఏ కష్టం వచ్చినా పరిటాల శ్రీరామ్ ముందుంటాడని స్పష్టం చేశారు.